# కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )

హైదరాబాద్
శనివారం
24-02-2024

వెల రూ.4/-
సంపుటి: 01 సంచిక: 15
పేజీలు: 04

Editor: Vanam Nagaiah


## తాడేపల్లిలో 28న ఉమ్మడి సభ



వివరాలు 02లో..







## రుణమాఫీపై రైతులకు త్వరలో
# శుభవార్త

### 27న ఫ్రీ విద్యుత్తు, సిలిండర్ పథకాలకు శ్రీకారం

- ప్రియాంక చేతుల మీదుగా ప్రారంభిస్తాం..
- మార్చి 2న మరో 6000 పోస్టులకు నోటిఫికేషన్
- కుంభమేళాకు రూ.కోట్లు ఖర్చు.. మేడారానికి జాతీయ హోదా ఇస్తే తప్పేంటి?
- మేడారంలో 'శాశ్వత అభివృద్ధి'కి కమిటీ
- జాతరకు ప్రధాని మోదీ, షా రావాలి..
- వనదేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

ములుగు, కెరటం న్యూస్-ఫిబ్రవరి 23:

రూ.2 లక్షల రుణ మాఫీపై రైతులకు త్వరలో తీపికబురు చెప్పబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, ఇప్పటికే రెండు పథకా లను అమలు చేస్తున్నామని, 27నుంచి మరో రెండింటిని ప్రారంభిస్తామని తెలిపారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతరకు శుక్రవారం వచ్చిన ఆయన తల్లులను దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని (66 కిలోల బెల్లం) తులాభారం వేయించి గద్దెల వద్ద అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు.

"రూ.500కే గ్యాస్ సిలిండర్‌తోపాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించే పథకాలను 27నుంచి అమలు చేస్తాం. కాంగ్రెస్ నేత ప్రియాంక చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం" మిగతా 2లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత
# దుర్మరణం

### ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం





- పటాన్‌చెరు సమీపంలో ముందు వాహనాన్ని, రెయిలింగ్‌ను ఢీకొన్న కారు
- లాస్య తల, ముఖానికి తీవ్రగాయాలు.. స్పాట్‌లోనే కన్నుమూత
- అధికారలాంఛనాలతో అంత్యక్రియలు
- పాడె మోసిన మాజీ మంత్రులు హరీశ్, తలసాని..
- సీఎం రేవంత్, కేసీఆర్ సహా పలువురి నివాళులు

కెరటం న్యూస్,
హైదరాబాద్, ఫిబ్రవరి 23:

బీఆర్ఎస్ ఎమ్మెల్యే (కంటోన్మెంట్) లాస్య నందిత (37) ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. శామీర్ పేట నుంచి ముత్తంగి ఔటర్ జంక్షన్ వైపు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ దాటిన తరువాత పటాన్‌చెరు శివారు ప్రాంతంలో కారు అతివేగంగా.. గుర్తు తెలియని వాహనాన్ని మిగతా 2లో..




## దేశచరిత్రలో తొలిసారి..

- 31లక్షల మందికి ఇళ్ల పట్టాలు
- ఇళ్ల స్థలాలపై పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తూ డీడ్స్
- రాష్ట్రంలో పేదలకు న్యాయం జరిగేలా చర్యలు
- విద్య,వైద్యరంగంలో కీలక నిర్ణయాలు అమలు
- ప్రకాశం జిల్లాలో ఇళ్లపట్టాల పంపిణీలో సీఎం జగన్

2

## నా వారణాసీ యువతను
# తాగుబోతులంటారా?



### కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఆగ్రహం..

కెరటం న్యూస్,
వారణాసి-ఫిబ్రవరి23:

వారణాసిలో యువత మద్యం తాగి రోడ్డు మీద పడి ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాని మోదీ వారణాసి లోక్‌సభ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓ సభలో పాల్గొని మాట్లాడారు. 'వాళ్లు నరేంద్ర మోదీని దశాబ్దాలుగా దూషిస్తున్నారు. కానీ ప్రస్తుతం వాళ్లు తమ అసహనాన్ని ప్రజల మీద చూపి స్తున్నారు. వాళ్లు కనీసం తెలివి లేకుండా ఉత్తరప్రదేశ్ యువతను మద్యం బానిసలు అంటూ నిందిస్తున్నారు. వారణాసి యువతపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా' అని ప్రధాని మోదీ అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న సమయంలో వారణాసిలో యువత మద్యం తాగి రోడ్డు మీద పడి ఉన్నారని వ్యాఖ్యానించా రు. రాహుల్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. 'ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ మిగతా 2లో..

## మేడారంలో అమ్మవార్లను
# దర్శించుకున్న గవర్నర్

- గద్దెల వద్ద కేంద్రమంత్రి ముండాతో కలసి పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పణ



కెరటం న్యూస్,
ములుగు-ఫిబ్రవరి23:

మేడారం సమక్క - సారమ్మ మహా జాతర వైభవంగా జరుగుతోంది. ఇప్పటికే పెద్ద సంఖ్యలో భక్తులు మేడారంకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, కేంద్ర మంత్రి అర్జున్ ముండా మేడారం చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్, మిగతా 2లో..

## ఎన్నికల ఏర్పాట్లలో
# ఈసీ బిజీ

- పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న అధికారుల బృందం
- 13 వరకు కొనసాగనున్న అధికారుల పర్యటన
- ఆ తరవాతే ఎన్నికల నోటిఫికేషన్‌కు ఛాన్స్




న్యూఢిల్లీ, కెరటం న్యూస్-ఫిబ్రవరి23:

లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లలో కేంద్ర ఎన్నికల సంఘం బిజీగా ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు పర్యటిస్తున్నారు. ఆయా చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు పరిస్థితులను మిగతా 2లో..



## కేసీఆర్ పాపాల ఫలితమే..
# బీఆర్ఎస్ ఓటమి

- బీఆర్ఎస్ ఒక్కసీటు గెలిచినా.. లాభం లేదు
- విజయసంకల్ప యాత్రలో కిషన్ రెడ్డి

కెరటం న్యూస్,
మంచిర్యాల-ఫిబ్రవరి23:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ పాలన ఖతమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపేర్కొన్నారు. కెసిఆర్ అవినీతే ఆయనను బొంద పెట్టిందన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాపాల ఫలితంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. ఫామ్ హౌస్‌కు వెళ్లి కాలు విరగొట్టుకున్నా మిగతా 2లో..

## గొర్రెల పంపిణీలో
# గోల్‌మాల్

- పత్రాల మాయంలో తలసాని పిఏ హస్తం
- టీపీసీసీ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

హైదరాబాద్, కెరటం న్యూస్-ఫిబ్రవరి23:

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గొర్రెల పంపకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని టీపీసీసీ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాగ్ నివేదికలో గత కేసీఆర్ ప్రభుత్వ అక్రమాలు పూర్తిగా బయటపడ్డాయని అన్నారు. గొర్రెలు పంపిణీ చేసిన వాహనాల రిజిస్ట్రేషన్న్ నెంబర్లు చూస్తే ఆశ్చర్యం వేస్తోందన్నారు. రూ.142 కోట్ల విలువైన గొర్రెల వివరాలు లెక్కలు లేవని మిగతా 2లో..

## తాడేపల్లిలో 28న ఉమ్మడి సభ

ఏలూరు, కెరటం న్యూస్–ఫిబ్రవరి23: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి బహిరంగ సభను ఈనెల 28న నిర్వహించనున్నారు. భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లును, ప్రాంగణాన్ని జనసేన నేత నాదెండ్ల మనోహర్ శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నేతలతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈనెల 28న ప్రత్తిపాడులో 21 ఎకరాల్లో ఉమ్మడి బహిరంగ సభ ఉంటుందని, రాష్ట్రం నలుమూలల నుంచి టీడీపీ, జనసైనికులతో పాటు ప్రజలందరిని ఈ సభకు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ వేదికపై 175 నియోజకవర్గాల నుండి 500 మంది టీడీపీ – జనసేన నేతలు పాల్గొంటారని తెలిపారు. ఆరు లక్షల మంది ఈ సభలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని, రాజకీయ ప్రస్థానంలో ఈ సభ అద్భుతంగా ఉంటుందని అన్నారు.

## నా వారణాసి యువతను తాగుబోతులంటారా?

(మొదటి పేజీ తరువాయి..)

అభివృద్ధి చెందుతోంది. కాంగ్రెస్ కుటుంబానికి చెందిన యువరాజు(రాహుల్ గాంధీ) యూపీ యువతను మద్యం బానిసలు అన్నారు. ఇదేం భాష. ఇండియా కూటమి యూపీ యువతను అవమానించిన తీరును ఎవరూ మర్చిపోరు. వారసత్వంగా వచ్చి ఆ వ్యక్తి దేశంలోని సామాన్య ప్రజలకు ప్రమాదకారి. తెలివిలేనివారు మాత్రమే నా వారణాసి యువతను మద్యం బానిసలు అని పిలుస్తారు.

## మేడారంలో అమ్మవార్లను దర్శించుకున్న గవర్నర్

(మొదటి పేజీ తరువాయి..)

కేంద్రమంత్రి నిలువెత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమిళిసై, అర్జున్ ముండా వనదేవతలను దర్శించుకున్నారు. దర్శనానంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సమ్మక్క సారలమ్మను కోరానని తెలిపారు. ఇది గొప్ప జాతర అని కొనియాడారు. లక్షల కొద్దీ ప్రజలు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారని తెలిపారు. 'నేను గవర్నర్‌గా మూడోసారి మేడారం జాతరకు రావడం నా అదృష్టం' అని గవర్నర్ తమిళిసై హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద ఆదివాసి జాతర అని కేంద్రమంత్రి అర్జున్ ముండా అన్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు, ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. సమ్మక్క సారలమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని కేంద్రమంత్రి అన్నారు. కాగా.. సమ్మక్క– సారలమ్మల నామస్మరణతో మేడారం మహా జాతర ప్రాంగణం మార్మోగుతోంది. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారాలను భక్తులు సమర్పిస్తున్నారు. ఇప్పటికే గద్దెలపైకి సమక్క సారలమ్మలు చేరుకోవడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈనెల 21 నుంచి జాతర ప్రారంభమవగా.. నాలుగు రోజుల పాటు వనదేవతల జాతర జరుగనుంది. తిరిగి అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

## గొర్రెల పంపిణీలో గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి..)

చెప్పారు. గొర్రెల పంపకాలపై సమగ్ర విచారణ జరగాలని అన్నారు. డిసెంబర్ 10వ తేదీన మాసబ్ ట్యాంక్‌లోని ఎనిమల్ హాజీబెండరీ ఆఫీస్ నుంచి పత్రాలు దొంగతనం చేశారని తెలిపారు. ఇందులో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పీఏ హస్తం ఉన్నట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని అన్నారు. ఇప్పుడు కేవలం నలుగురు అధికారులను బాధ్యులను చేసి ప్రభుత్వం ఊరుకుంటే అసలు దోషులు బయటపడరని అన్నారు. తప్పు చేసిన అందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చేపల పంపిణీలలో కూడా అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. గొర్రెలు, చేపల పంపిణీలపై లెక్కలు తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌పై కూడా వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం విచారణ జరపాలని నిరంజన్ డిమాండ్ చేశారు.

## కేసీఆర్ పాపాల ఫలితమే.. బీఆర్ఎస్ ఓటమి

(మొదటి పేజీ తరువాయి..)

డన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే వృథా అవుతుందన్నారు. ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటు గెలిచినా.. తెలంగాణకు లాభం లేదని.. గెలవకున్నా రాష్ట్రానికి నష్టం ఉండదన్నారు. మోసపూరిత కాంగ్రెస్ ను కూడా నమ్మొద్దని.. అవినీతికి చిరునామా ఆ పార్టీ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తుకు సంబంధించినవని.. మోదీతోనే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు చచ్చేది లేదన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కాంగ్రెస్ నాయకులే వద్దంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఏలి రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాజేసిందని ఆరోపించారు. దేశంలో సకల సమస్యలకు కాంగ్రెస్ (అనీనిణస।బబ) కారణమన్నారు. ఆర్టికల్ 370 ని రద్దుతో కశ్మీర్‌లో జాతీయ జెండా రెపరెపలాడుతోందన్నారు. 500 ఏళ్ల క్రితం నాటి అయోధ్య సమస్యను కేంద్ర ప్రభుత్వం శాంతి యుతంగా పరిష్కరించి, రామ మందిరాన్ని నిర్మించిందని తెలిపారు. 370 పార్లమెంటు స్థానాలు బీజేపీకి రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అందులో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం కూడా ఉండాలన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలందరూ నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాన మంత్రి కావాలని కోరుకుంటున్నారని కిషన్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ జన్మలో ప్రధాన మంత్రి కాలేడని విమర్శించారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ని గెలిపిస్తేనే హామీలు అమలు చేస్తామనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. శుక్రవారం కాగజ్ నగర్‌లో నిర్వహించిన బీజేపీ విజయ్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు నిధులనెలా సమకూర్చుకుంటారో బయట పెట్టాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఎన్నిక అవుతారని కిషన్ రెడ్డి అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400లకు పైగా సీట్లను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు సైతం మోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు.

## రుణమాఫీపై రైతులకు త్వరలో శుభవార్త..

(మొదటి పేజీ తరువాయి..)

అని తెలిపారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆదరణ పొందిందని, మేడారం జాతరకు 6 వేల బస్సులు నడిపి వాటిలోనూ మహిళలను ఉచితంగా జాతరకు తరలించామని చెప్పారు. జాతరను దృష్టిలో ఉంచుకొని కొత్తగా 100 బస్సులను కొనుగోలు చేసి నడుపుతున్నామని తెలిపారు.

**మార్చి 2న మరో 6000 కొలువులు..**

తాము అధికారంలోకి వచ్చిన 75 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, వీటిలో 6,956 స్టాఫ్ నర్సుబీ సింగరేణిలో 441బీ 10 వేలకుపైగా పోలీస్, ఎక్సైజ్, ఫైర్ శాఖలో కొలువులు కల్పించామని సీఎం రేవంత్ తెలిపారు. మార్చి 2న మరో 6 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు. ఇటీవల 25 వేల ఉద్యోగాల భర్తీని చూసి కుళ్లుకుంటున్నవారు చూసేలా ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించామన్నారు. మామ, అల్లుడు, బావ, బామ్మర్దులు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ బదిలీల్లో పారదర్శకత పాటిస్తున్నామని, గతంలో జీతం ఎప్పు డు వస్తుందోనని ఉద్యోగులు ఎదురు చూసేవారని, ప్రస్తుతం ఒకటో తేదీనే జీతాలు వేస్తున్నామని అన్నారు. ఒక గంట కూడా సెలవు తీసుకోకుండా తన మంత్రివర్గ సహచరులు పని చేస్తున్నారని తెలిపారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు రాష్ట్రంలో పది స్కిల్ యూనివర్సిటీలను ప్రారంభించారని, అనేక మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు.

**బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం..**

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందానికి తెగబడుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. "బయటకు విమర్శలు చేసుకుంటున్నా.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఏడుచోట్ల బీజేపీ, పది స్థానాల్లో బీఆర్ఎస్ పోటీ చేసేలా చీకటి ఒప్పందం కుదిరింది. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి" అని పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించామని, బీజేపీ నేతలు మాత్రం సీబీఐకి అప్పగించాలని కోరుతున్నారని, సీబీఐకి అప్పగిస్తే కేసులతో బెదిరించి కేసీఆర్‌ను గిల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ అవినీతిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని, సీబీఐ, ఈడీ, ఐటీ వాళ్ల చేతుల్లోనే ఉన్నా ఎటువంటి విచారణ జరపలేదని గుర్తు చేశారు. అందుకే, హైకోర్టు లేదా సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని భావిస్తున్నామన్నారు. "కుంగిన మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి అన్నారం బ్యారేజీలో పోయాలని హరీశ్ రావు అంటున్నారు. దూలంలా పెరిగినా దూడకు ఉన్న బుద్ధి కూడా ఆయనకు లేదు. అన్నారం బ్యారేజీలో లీకేజీలు అవుతున్నాయనే కిందికి వదులుతున్నాం. కిందికి వదిలిన నీటిని పైకి ఎత్తి పోయాలని ఎలా అంటున్నారు!?" అని మండిపడ్డారు.

**కిషన్ రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి..**

మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేమంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కుంభమేళాకు లక్షల కోట్లు ఖర్చు పెడుతున్న కేంద్రం.. గిరిజన జాతరకు జాతీయ హోదా ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. మేడారానికి కేంద్రం మొండి చేయి చూపిందని పత్రికల్లో వార్తలు వస్తే.. రూ.3 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. అయోధ్యలో రామాలయాన్ని ఎలా దర్శించుకుంటామో సమ్మక్క–సారలమ్మలను కూడా అలాగే దర్శించుకునేందుకు మోదీ, షా రావాలని, వారి కోసం అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం మేడారంపై నిర్లక్ష్యం చేసి మూల్యం చెల్లించుకుందని, బీజేపీకి కూడా అలాంటి పరిస్థితే వస్తుందని హెచ్చరించారు. జాతరలో తాత్కాలిక పనులతో కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయని పత్రికల్లో వార్తలు వచ్చాయని, శాశ్వత పనుల కోసం త్వరలోనే మంత్రులతో కమిటీ వేస్తామని చెప్పారు. మంత్రులు సీతక్క, సురేఖ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కమిటీ వేసి ఆదివాసీలు, భక్తుల నుంచి సలహాలు తీసుకుంటామన్నారు.

**75 రోజుల్లో ప్రజల్లో విశ్వాసం కల్పించాం..**

సమస్యలు చెబితే తీరుతాయనే నమ్మకాన్ని ఈ 75 రోజుల తమ హయాంలో కల్పించామని సీఎం రేవంత్ తెలిపారు. సరిగ్గా ఏడాది కిందట ప్రతిపక్ష నేతగా అమ్మవార్లను దర్శించుకొని మొక్కుకున్నానని, రాష్ట్ర ప్రజల అభీష్టాన్ని ఆ తల్లి మన్నించినందుకు మొక్కు తీర్చుకున్నానని తెలిపారు. వన దేవతల ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. సీఎం వెంట జాతరకు వచ్చిన సీఎస్ శాంతి కుమారి కూడా అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు.

**గృహజ్యోతి, సిలిండర్ పథకాలకు చేవెళ్ల నుంచే శ్రీకారం..**

కాంగ్రెస్ పార్టీ తనకు సెంటిమెంట్‌గా మారిన చేవెళ్ల నుంచే ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలకు శ్రీకారం చుట్టనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరుకానున్నారు. ఈనెల 27న సీఎం రేవంత్ రెడ్డి, ప్రియాంకగాంధీ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు నిర్వహిస్తున్న సభ కావడంతో పెద్దఎత్తున మహిళా సంఘాలను తరలించనున్నారు. సభ ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ శశాంక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి..)

వెనక నుంచి ఢీకొని అదుపు తప్పి రోడ్డుకు ఎడమవైపు దూసుకెళ్లి రెయిలింగ్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదం తీవ్రతకు వాహనం ముందు వైపు ఎడమ భాగం నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. రెండు కాళ్లూ విరిగిపోవడంతో ఆయన కారులోనే ఇరుక్కుపోయారు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న నందిత సీటు బెల్ట్ పెట్టుకున్నా, ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకున్నా.. ఆమె తలకు, ముఖానికి, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి సదాశివపేట మండలం ఆరూర్‌లోని మిస్కిన్ షా దర్గాను సందర్శించారని.. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకునే క్రమంలో టిఫిన్ చేసేందుకు మరోమారు సంగారెడ్డి వైపునకు తిరుగు ప్రయాణం అయ్యారని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు. ముత్తంగి జంక్షన్ వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ల వద్దకు వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. ప్రమాదవార్త తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న పటాన్‌చెరు పోలీసులు.. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను మియాపూర్ శ్రీకర ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే లాస్యనందితను పటాన్‌చెరులోని అమేధా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి వార్త తెలియగానే కుటుంబసభ్యులు, బంధువులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరు కున్నారు. ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. లాస్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె మృతిపై మాట్లాడాలని విలేకరులు కోరినా విషణ్ణవదనంతో మౌనంగా ఉండిపోయారు. గాంధీ ఆస్పత్రిలోపోస్టమార్టమ్ జరుగుతున్నంతసేపూ అక్కడి వెయిటింగ్ హాలులోనే కూర్చున్నారు. అనంతరం లాస్య ఇంటికి వెళ్లి ఏర్పాట్లు పర్యవేక్షించడంతోపాటు అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకూ ఉన్నారు.

**డ్రైవర్ నిద్రమత్తు వల్లనే..:** డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలోని మిస్కిన్ షా బాబా దర్గా సందర్శన అనంతరం.. లాస్య తన కుటుంబసభ్యులతో కలిసి రెండు కార్లలో హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఆమె టీఎస09జీజీ టీఆర్ 1955 నంబర్ గల మారుతీ సుజుకీ ఎక్స్‌ఎల్ 6 కారులో ప్రయాణిస్తున్నారు. అల్పాహారం కోసం శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎక్కి సంగారెడ్డి వైపు వస్తుండగా సుల్తాన్‌పూర్ టోల్ ప్లాజా దాటిన తర్వాత సుమారు 5.10 గంటల సమయంలో డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులోకి జారుకుని, కారుపై నియంత్రణ కోల్పోయి, ఎడమ వైపు ఉన్న ఓఆర్ఆర్ మెటల్ బీమ్‌కు బలంగా ఢీకొట్టాడు. దీంతో ఎమ్మెల్యే అక్కడికక్కడే మృతి చెందారు. కాగా.. 5.15 గంటల సమయంలో ఆకాశ్ తనకు ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని, కేవలం గాయాలు మాత్రమే అయ్యాయని తెలిపాడని లాస్య నందిత సోదరి నివేదిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ప్రమాద స్థలికి వచ్చి చూసేసరికి లాస్య చనిపోయి ఉందని ఆమె పేర్కొన్నారు. దీంతో డ్రైవర్ ఆకాశ్‌పై ఐపీసీ 304(ఎ) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో కారు విడిభాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్న తీరుచూస్తే.. ముందు వెళుతున్న వాహనం వెనకభాగాన్ని ఢీకొనగా, అది సుమారు వందమీటర్ల వరకు ఈ కారును ఈడ్చుకెళ్లినట్టు అంచనా వేస్తున్నారు. ఆ వాహనం ఆచూకీ మాత్రం తెలియరాలేదు. అలాగే.. ప్రమాద సమయంలో వారి కారు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్టు స్పీడోమీటర్ వల్ల తెలుస్తోంది.

**పోస్ట్‌మార్టమ్ రిపోర్టు..:** ఈ ప్రమాదంలో లాస్య తలకు బలమైన గాయమై మరణించినట్టు పోస్ట్‌మార్టమ్ నిర్వహించిన వైద్యులు నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం ఉదయం 9.55 గంటల సమయంలో లాస్య భౌతికకాయాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగాధిపతి కృపాల్‌సింగ్, డాక్టర్ లావణ్య, పీజీ వైద్యులు పోస్ట్‌మార్టమ్ నిర్వహించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదంలో ఆమె తలకు కుడిభాగంలో, మెడవద్ద తీవ్రగాయాలయ్యాయి. ఎడమ కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఛాతీ ఎముకలు విరిగాయి. వెన్నుకు తీవ్రగాయాలయ్యాయి. ఆరు దంతాలు పూర్తిగా విరిగిపోయాయి. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. అయితే, తలకు తీవ్రగాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకుని అక్కడే మృత్యువాత పడినట్లు వైద్యులు అంచనాకు వచ్చారు. పోస్ట్‌మార్టమ్ పూర్తి నివేదిక రావాల్సి ఉంది. ఇక.. ప్రమాద సమయంలో కారు నడుపుతున్న ఆకాశ్ కనుబొమ పైభాగం, ముఖం వద్ద చిన్న చిన్న ఫ్రాక్చర్లు అయినట్లు, ఎడమ కాలు తొడ వద్ద ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స చేస్తున్నామని చెప్పారు.

**కన్నీటి నివాళులు..:** లాస్య తండ్రి మాజీ ఎమ్మెల్యే జి.సాయన్న గత ఏడాది ఫిబ్రవరి 19న అనారోగ్యంతో మరణిం చారు. నాలుగు రోజుల క్రితమే ఆయన ప్రథమ వర్ధంతి జరిగింది. అంతలోనే ఆయన కుమార్తె మృతి చెందడంతో.. వారి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. లాస్య మరణవార్త తెలియగానే ఆమె తల్లి గీత స్పృహ తప్పిపడిపోయారు. లాస్యను తలచుకుంటూ భోరున విలపిస్తున్న ఆమె తోబుట్టువులు నమ్రత, నివేదితను, కుటుంబసభ్యులను ఆపడం ఎవరితరం కాలేదు. ఏడాది వ్యవధిలో తండ్రి, తనయ మరణించడంతో కంటోన్మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. గాంధీ ఆస్పత్రి లో పోస్టుమార్టం అనంతరం ఉదయం 11.45 గంటలకు లాస్య భౌతికకాయాన్ని సికింద్రాబాద్ కారానా గృహలక్ష్మి కాలనీలోని నివాసానికి తీసుకు వచ్చారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్ దగ్గరుండి ఏర్పాట్లు చేయించారు. అనంతరం మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. లాస్య మృతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మేడారంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన రేవంత్.. నేరుగా లాస్య నివాసానికి చేరుకొని ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అంతకుముందు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కేసీఆర్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. లాస్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ కవిత మృతదేహం రాక ముందే కారా నాలోని ఇంటికి చేరుకున్నారు. లాస్య తల్లి గీత, సోదరి నమ్రత, నివేదితను ఓదార్చారు. స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎంపీలు కే కేశవరావు, సంతోషకుమార్ తదితరులు కన్నీటి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు లాస్య కడసారి చూపు కోసం తరలివచ్చారు. రేవంత్ ఆదేశాలతో లాస్యనందితకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని హిందూ శ్మశానవాటికలో రాత్రి 7.10 గంటలకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హరీశ్, తలసాని, వేముల, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి పాడె మోశారు. సాయన్న మరదలు కుమారుడు పీయూష్ రాఘవ లాస్య చితికి నిప్పంటించారు. కాగా.. లాస్యనందిత మృతి పట్ల తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మంత్రి కొండా సురేఖ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్, టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం తెలిపారు. లాస్య మృతి పట్ల తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తంచేసిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్.. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

## దేశచరిత్రలో తొలిసారి 31లక్షల మందికి ఇళ్ల పట్టాలు

ఒంగోలు, కెరటం న్యూస్–ఫిబ్రవరి23: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏపీ సీఎం జగన్ మరింత దూకుడు పెంచారు. వరుస సభలు, సమావేశాలతో హోరెత్తిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సామాన్యులకు మరింత చేరువ అవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒంగోలులో పర్యటించి స్థానికులు ఇళ్ల స్థలాల పై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాల పంపిణీ, లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్లు అందజేశారు. చరిత్రలోనే తొలిసారి పేదలకు ఇంటి స్థలాల రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ చేస్తున్నామని.. తద్వారా ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకే సర్వహక్కులు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎన్.అగ్రహారంలో నిర్వహించిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు ఒంగోలు తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి జగన్ మాట్లాడారు. 31 లక్షల పేదలకు ఇళ్ల పట్టాలను పొజిషన్ సర్టిఫికెట్ల రూపేణా, అన్ డివైడెడ్ షేర్ ప్లాట్ల రూపేణా ఇచ్చే కార్యక్రమం జరిగిందని జగన్ అన్నారు. దేశ చరిత్రలో తొలిసారి 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలను సైతం రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మల చేతుల్లో పెడుతున్నామన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలిచ్చే విషయంగానీ, శాశ్వతంగా మేలు చేసే అడుగులు వేసే విషయంలోగానీ, ఇళ్ల నిర్మాణం విషయంలో గానీ గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడా ఎంత ఉందో గమనించాలన్నారు. మనం చేసే ప్రతి పనీ 58 నెలల కాలంలో వేసిన ప్రతి అడుగూ పేదల జీవితాలు మారాలి, వారి బతుకులు మారాలి, పేద పిల్లలు ఎదగాలి, భవిష్యత్ లో పేదరికం నుంచి బయటకొచ్చే పరిస్థితి రావాలని ప్రతి అడుగూ పడిందని అన్నారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం ఉండటానికి వీల్లేదని, పేదలకిచ్చే ఇళ్ల పట్టాలను కూడా రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులకు గానీ, ఎమ్మెల్యేలకు ఇచ్చే పట్టాలుగానీ, ఏ నిబంధనలైతే వాళ్లకు పెడతామో అటువంటి నిబంధనలతో ఇళ్ల పట్టాలను అందించాం సీఎం జగన్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 17,005 జగనన్న కాలనీ లే అవుట్లు. 60వేల కోట్లతో 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు. రాష్ట్రవ్యాప్తంగా 71,811 ఎకరాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ జరుగుతోంది. మౌలిక సదుపాయాల కోసం ప్రతీ ఇంటికి లక్ష ఖర్చు చేశాం. అక్కచెల్లెమ్మలను లక్షాధికారులు కాదు.. మిలియనీర్లను చేస్తున్నాం.

## ఎన్నికల ఏర్పాట్లలో ఈసీ బిజీ

(మొదటి పేజీ తరువాయి..)

అంచనా వేస్తున్నారు. తగువిధంగా సూచనలు చేస్తున్నారు. పలువురు అధికారులను బదిలీ చయిస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో అధికారులు పర్యటిస్తున్నారు. తర్వాత ఉత్తర ప్రదేశ్ , జమ్ము కశ్మీర్‌లో పర్యటిస్తారు. అన్ని రాష్ట్రాల్లో అధికారుల పర్యటన మార్చి 13వ తేదీ లోపు ముగియనుంది. 13వ తేదీ తర్వాత ఏ క్షణమైన లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రాల్లో ఉన్న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంల తరలింపు, భద్రతా దళాల మోహరింపు, సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకోవాలని కేంద్ర అధికారులు భావిస్తున్నారు. లోక్ సభ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏఐ సేవలను వినియోగిస్తారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు దృష్టిసారించారు.



## నేడు పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన

**(పాలేరు, కెరటం న్యూస్ ప్రతినిధి)**
కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో జరిగే పలు వివాహాది శుభకార్యక్రమాలు, దైవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ అధిక సంఖ్యలో హాజరై ప్రసాద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీలు అందజేత





**(రఘునాధపాలెం, ఫిబ్రవరి 23, కెరటం న్యూస్)**
రఘునాధపాలెం మండల పరిధిలోని కోయచలక ,రేగులచలక అంగన్వాడీ కేంద్రాలకు శుక్రవారం పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ కుర్చీలు అందజేసింది .చిన్నారుల వికాసం, గర్భిణీ స్త్రీలు మరియు బాలింతల ఆరోగ్యం కోసం ప్రారంభించిన అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఇప్పటికే పలు అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీలు సమకూర్చిందని ,ఈరోజు కోయచలక, రేగులచలక కేంద్రాలకు కుర్చీలు అందజేస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య తెలిపారు. చిన్నారి బాలబాలికలకై 15 కుర్చీలు, గర్భిణీ స్త్రీలు కొరకు 5 కుర్చీలు చొప్పున కోయచలక ,రేగుల చలక కేంద్రాలకు అందజేసామని ,వాటిని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య అంగన్వాడీ ఉపాధ్యాయినులను కోరారు. ఈకార్యక్రమంలో రఘునాధపాలెం క్లస్టర్ పర్యవేక్షకురాలు గూడూరు కృష్ణకుమారి, కోయచలక ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మందడపు రమాదేవి, కోయచలక అంగన్వాడీ టీచర్ మంగిశెట్టి వెంకటలక్ష్మి,ఆయా చెరుకూరి జయప్రద, రేగులచలక అంగన్వాడీ టీచర్ జి.రాజేశ్వరి, ఆశాకార్యకర్త యర్రబెల్లి సుశీల, చిన్నారుల తల్లులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు..

### రూరల్ ఎస్ఐ బి లక్ష్మీ భార్గవి



**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**
మధిర మండలంలోని ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని మధిర రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు స్వీకరించిన బి లక్ష్మీ భార్గవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ కు మండల ప్రజలు సహకరించాలని ఆమె తెలిపారు. బాధితులు ఏ అవసరం వచ్చినా నేరుగా సంప్రదించాలని పైరవీకారులను వెంట తీసుకురావద్దని ఆమె సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని గంజాయి, పేకాట తదితర తదితర మాదకద్రవ్యాల విక్రయాలపై దృష్టి సారిస్తామని అదేవిధంగా చోటామోటా నాయకులు సెటిల్మెంట్లకు పాల్పడిన సహించమని లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణకు కృషి చేస్తానని ఆమె అన్నారు. అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుందని అక్రమ మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా తరలిస్తున్నారని అటువంటి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోనై గంజాయి సేవిస్తున్నారని సమాచారం కూడా ఉందని వాటన్నింటినీ అరికట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. రూరల్ పరిధిలో రాత్రి పగలు తేడా లేకుండా బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని జనావాసాల మధ్య ఉన్న బెల్టు దుకాణాలను తొలగించేల చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా యువతరం చెడు వ్యసనాలను విడనాడాలని ఫ్రెండ్లీ పోలీస్ కి సహకరించాలని యువతరం తలుచుకుంటే దేన్నైనా సరే మార్చగలిగే సత్తా కేవలం యువతరానికే ఉందని మండలాన్ని పేరు తెచ్చే విధంగా యువతరం ముందడుగు వేయాలని ఆమె సూచించారు.

# 28 నుండి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు

- 70 కేంద్రాల్లో పరీక్షలు వ్రాయనున్న 36,578 మంది విద్యార్థులు
- జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి రవిబాబు

**(ఖమ్మం కలెక్టరేట్, కెరటం న్యూస్)**
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి రవిబాబు చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులకు సూచించారు. ఈ నెల 28 నుండి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 12 గంటల వరకు కొనసాగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షల నిర్వహణపై శుక్రవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలోఅధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కంద్రాలను సందర్శించి ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలును పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటె తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.జిల్లాలో ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 36, 578 మంది పరీక్షలు వ్రాయనున్నారని, ఇందుకోసం 70 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సి.సి.కేమేరా నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్, దుర్వినియోగా లకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. అధికారులకు ఇచ్చిన బుక్ లెట్ లోని మార్గదర్శకాలను ఖచితంగా పాటిస్తూ విద్యార్థులకు నిర్ధారిత సమయంలో ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు అందించాలని, వాటిపై విద్యార్థులు హాల్ టికెట్ సరిగ్గా వేసేలా ఇన్విజిలేటర్ సంతకం చేసేలా చూడాలన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని, ఉదయం 9.00 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతించారాదని స్పష్టం చేశారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెస్ పరీక్షా కేంద్రాలలో అనుమతించబడవని అన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయ న్నారు. జవాబుపత్రాలను క్లోస్డ్ కంటైనెర్ లో తరలించేలా చూడాలని తపాలా శాఖకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలనీ రెవెన్యూ, పోలీస్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో హైపవర్ కమిటీ డాక్టర్ కి. శ్రీనివాసరావు, మెంబెర్స్ వెంకటేశ్వరరావు, సింహాచలం, వీరభద్రం చీఫ్ సూపెరింటెండెంట్లు, శాఖాపర అధికారులు తదితరులు పాల్గొన్నారు.








## ఘనంగా క్రాంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వీడ్కోలు సభ.....

**(వైరా, కెరటం న్యూస్ ప్రతినిధి)**
స్థానిక ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించాలని, సూచించారు. క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యా బోధన చేయడమే మా క్రాంతి జూనియర్ కళాశాల ప్రత్యేకత అని అన్నారు.గత విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను మరియు వివిధ సామాజికసేవ, సాంస్కృతిక, కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు ఇవ్వడం జరిగింది.అనంతరం విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, %ఉ=ూహీూ% ఉపాధ్యక్షులు ఉమాశంకర్, ప్రముఖ మోటివేటర్ తాటిపల్లి సుధీర్, ప్రిన్సిపల్ కృష్ణారావు,%చీూ ూూ% లింగారావు, అధ్యాపకులు మజీద్,వేణు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బయ్యన్నగూడెంలో పలువురిని పరామర్శించిన సండ్ర



**సత్తుపల్లి, కెరటం న్యూస్**
పెనుబల్లి మండలం, బయ్యన్నగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్ నందు వైద్యం చేయించుకున్న ఏలూరు పూర్ణయ్య, విశ్వనాధుల నాగేశ్వరరావులను సండ్ర వెంకటవీరయ్య గారు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలు సుకొని, త్వరగా కోలుకోవాలి ఆకాం క్షిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన పార్టి కార్యకర్త కొల్లి మురళి ఇటీవల మరణించగా వారి కుటుం బాన్ని పరామర్శించి ఓదార్చారు. వీరితోపాటు మండల బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, చెక్కిలాల లక్ష్మణరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, కోమటి ప్రసాద్, మందడపు అశోక్, మరకాల వెంకీ, చంటి, మధు తదితరులున్నారు.

## భట్టికి కృతజతలు తెలిపిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



**(మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి)**
మధిర నియోజకవర్గ కేంద్రంలో అడిషనల్ జేఎ ఫ్సీఎం కోర్టు, పిడిఎం కోర్టు భవన నిర్మాణాలకు రూ.24 కోట్లు నిధులు మంజూరు చేయించిన డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క ని శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మధిర బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞ తలు తెలిపారు. కోర్టు బిల్డింగ్ కమిటి చైర్మెన్ కట్ట పూర్ణచందర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొజెడ్ల పుల్లారావు, బార్ అసోసియేషన్ ఉపాధ్య క్షులు వాసిరెడ్డి వెంకటేశ్వర్‌రావు, సీనియర్ న్యాయ వాది నెల్లూర్ రవిలు డిప్యూటి సీఎం భట్టి విక్ర మార్క ని కలిసి ఈ సందర్భంగా శాలువ కప్పి, పూల మాలతో సత్కరించారు. మధిర కోర్టు భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న మల్టీ గ్రేయిన్ మార్కెట్‌లో తాత్కలికంగా కోర్టును నడుపు కోవడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించాలని కోరారు. అదే విధంగా ప్రస్తుతం కోర్టు ప్రాంగణంలో ఉన్న సబ్ జైలును మరో చోటకు తరలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## తిరుపతమ్మ స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు..

**(కెరటం న్యూస్ గార్ల ప్రతినిధి)**
గార్ల మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో 41రోజుల తిరుపతమ్మ మాల ధరించి నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో దీక్షను పురస్కరించుకొని శుక్రవారం తిరుపతమ్మ దేవాలయం ప్రాంగణంలో వైభవంగా ఇరుముడి మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గార్ల మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు ఎంపీటీసీ రాజకుమారి యూత్ కాంగ్రెస్ నాయకులు గోస్ నాగేష్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దనియకుల రామారావు మాట్లాడుతూ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి దీవెనలతో గ్రామంలో, మండలంలో ప్రజలందరూ పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు ప్రతి ఒక్కరు దైవభక్తి పెంపొందించుకోవాలని కోరారు, అనంతరం 15 మంది స్వాములు ఇరుముడి ధరించగా స్వాములకు పూలమాలలు వేసి ఆశీర్వాదం తీసుకున్నారు, తిరుపతమ్మ నామ శరణు ఘోషలు భజన, సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఇరుముడి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్, మహేష్ అశోక్, బిక్షం తదితరులు పాల్గొన్నారు..

## ఆర్ఎంపి ల క్లినిక్‌లపై దాడులను ఆపాలి..

- ప్రాథమిక చికిత్స మాత్రమే చేయండి...
- ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి బోయినపల్లి శ్రీనివాస్ రావు....



**(ఖమ్మం టౌన్, కెరటం న్యూస్)**
గతకొద్ది రోజులుగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్న ఆర్ఎంపి ,పియంపి ల క్లినిక్ లపై వైద్య శాఖ అధికారులు చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి బోయినపల్లి శ్రీనివాస్ రావు జిల్లా కమిటీ సభ్యులు షేక్ నాగుల్ మీరా లు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో పేదప్రజలకు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్న గ్రామీణ వైద్యులపై వైద్య శాఖ అధికారులు చేస్తున్న దాడులపై పునరాలో నచేయాలని కోరారు.కొంతమంది గ్రామీణ వైద్యులు పరిమితి కిమించి చేస్తున్న అనైతిక వైద్య పద్ధతులను మార్చుకోవాలని హితవు పలికారు. అడ్డగోలుగా వైద్యం చేస్తున్న ఆర్ఎంపి ల వ్యవహారశైలి వలన గ్రామీణ వైద్య వ్యవస్థకి కళకంగా మారే అవకాశం ఉందన్నారు .ఇకనైనా గ్రామీణ వైద్యులు బాధ్యతయుతమైన వైద్యం అందించాలన్నారు.

## మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరైన సిరిపురం సైదల్లిపురం గ్రామాలలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి**
మధిర నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషి తో మంజూరైన నిధులతో సిరిపురం, సైదెల్లిపురం గ్రామాలల్లో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్లకు శంకుస్థాపన చేయటం జరిగింది. కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్ణాటి రామారావు, నిడమానూరు వంశీ కృష్ణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధారా బాలరాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, మండల బీసీ సెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, సైదెల్లిపురం గ్రామ మాజీ సర్పంచ్ పులి బండ్ల చిట్టిబాబు, కోటా డేవిడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వనమా పిచ్చయ్య,





కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, చీరాల వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి రోడ్ల పనులను ప్రారంభించారు.

## మేడారంలో భక్తుల కిటకిట

### క్యూలన్లో తొక్కిసలాటలో ఇద్దరికి గాయాలు

**(కెరటం న్యూస్)**
మేడారం మహాజాతరకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చి తనివితీరా మొక్కులు చెల్లించుకొని తన్మయత్వం పొందుతున్నారు. కాగా, భక్తులు పోటెత్తడంతో మేడారం క్యూలైన్లలో తొక్కిసలాట నెలకొంది. సమ్మక్క భక్తులు–హిజ్రాలు ఘర్షణకు దిగారు. పరస్పరం దాడి చేసుకోవడంతో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి( తినితీబీస¡ట). ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.